క్లుప్తంగా

మంత్రి పొన్నంకు నాయీబ్రాహ్మణుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణులు

మద్దూరు(హుస్నాబాద్): రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మండల నాయీబ్రాహ్మణులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి వివరించి వినతి పత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపినట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఇమాంబాద్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నాయిని సంజీవరెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం పరామర్శించారు. ఆయన చిన్నాన్న నాయిని మహేందర్‌రెడ్డి కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారిని మాజీ మంత్రి ఓదార్చారు. ఆయన వెంట సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెర్గు రాజనర్సు ఉన్నారు.

మండల అభివృద్ధికి ప్రణాళికలు

మద్దూరు(హుస్నాబాద్): మండల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పాలకవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను మండల పరిషత్‌లో సుమారు రూ.27 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని, ఆ నిధులను ఖర్చు చేసేందుకు శాఖలవారీగా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతమల్లేశం, ఎంపీడీఓ శ్రీనివాస్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్

మద్దూరు(హుస్నాబాద్): ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. సోమవారం దూళ్మిట్ట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా వ్యవహరిస్తే ప్రజలు ఉద్యమిస్తారన్నారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి అర్హులందరికీ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు రవికుమార్, మండల కార్యదర్శి భాస్కర్, రాజు, నరేశ్ పాల్గొన్నారు.

మేడిపల్లి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నరేశ్

చిన్నకోడూరు(సిద్దిపేట): మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయంలో గణిత విభాగం పరిశోధకుడుగా పనిచేస్తున్న మేడిపల్లి గ్రామానికి చెందిన పరకాల నరేశ్‌కు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డా.ఎం.రమేశ్ కుమార్ సోమవారం డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్‌ను ప్రొఫెసర్‌లు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

శిక్షణతో పాటు కుట్టు మిషన్



మహిళలకు కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందజేస్తున్న రాము

నంగునూరు(సిద్దిపేట): మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా మిషన్లు అందజేశామని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాము తెలిపారు. రాజగోపాల్‌పేటలో మూడు నెలలుగా ఇస్తున్న శిక్షణను పూర్తిచేసుకున్న మహిళలకు సోమవారం కుట్టు మిషన్లతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ లేబర్ డిపార్ట్ మెంట్ ద్వారా మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేంద్ర, ఎంపీటీసీ సుమలత, నాయకులు చందు, రాజుగౌడ్, కమాల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు ముగిస్తే రైతుకు కష్టం

- గడువు ముగియడంతో ఆందోళన
- డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్‌రూరల్/జగదేవ్‌పూర్(గజ్వేల్): పత్తి కొనుగోళ్లు ముగిస్తే రైతులు నష్టపోతారని డీబీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలని సోమవారం గజ్వేల్‌లో ఏఎంసీ సెక్రెటరీ జాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రక్రియ 31తో ముగియనుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఓ వైపు ఏఈవోలు పత్తి దిగుబడి వివరాలను సరిగ్గా నమోదు చేయకపోవడం, నూతన సంవత్సరం, సంక్రాంతి సెలవులు రావడంతో మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడం, తత్ఫలితంగా కొనుగోలుకు నిరాకరించడం లాంటి సమస్యల వల్ల రైతులు ఇప్పుడిప్పుడే అమ్మకాలకు సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. అయితే 31తో గడువు ముగుస్తుందనడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లకు గడువు పొడిగించాలని కోరుతున్నామన్నారు.

ఆందోళన కార్యక్రమాలు చేపడతాం

పత్తి కొనుగోళ్లు చేపట్టకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య హెచ్చరించారు. పత్తి సీజన్ ముగియకుండానే కొనుగోలు సెంటర్లు మూసివేసే చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద వేలాది క్వింటాళ్ల పత్తి ఉందని, దానిని కొనుగోలు చేయకుండానే నిలుపుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఫిబ్రవరి చివరి వరకు కొనుగోళ్లను జరపడంతో పాటు మద్దతు ధర కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



గొల్లపల్లి పత్తి మిల్లు వద్ద బారులు తీరిన వాహనాలు

బారులు తీరిన పత్తి లోడ్ లారీలు..

ఈ నెల 31తో సీసీఐ మూసివేస్తామని ప్రకటించడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు నిల్వ చేసిన పత్తిని వాహనాల్లో నింపుకుని పత్తి మిల్లుల ఎదుట సోమవారం బారులు తీరారు. గొల్లపల్లి, అలిరాజ్‌పేట పత్తి మిల్లుల వద్ద పదుల సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. సీసీఐ కొనుగోలును పొడిగించాలని రైతులు కోరారు.



ఏఎంసీ సెక్రెటరీ జాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

అందుబాటులో ఉండి సేవలందించాలి

- సీపీ అనురాధ
- నూతన సీఐలకు అభినందనలు

సిద్దిపేటకమాన్/రూరల్/చేర్యాల(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక): సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో పలువురు సీఐలు నూతనంగా బాధ్యతలు చేపట్టారు. పలువురిని బదిలీ చేస్తూ వారి స్థానంలో నూతన సీఐలను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో పలువురు సీఐలు వారికి కేటాయించిన స్టేషన్‌లలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట టూటౌన్ నూతన సీఐగా బి.ఉపేందర్, త్రీటౌన్ నూతన సీఐగా సీహెచ్ విద్యాసాగర్, తొగుట నూతన సీఐగా ఎస్‌కే లతీఫ్, రూరల్ నూతన సీఐగా ఎం.శ్రీను సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వారంతా పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారిని అభినందించారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. అలాగే చేర్యాల నూతన సీఐగా ఎల్.శ్రీను సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన సత్యనారాయణరెడ్డి ఐజీపీ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీను వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు.



సీపీ అనురాధకు మొక్కను అందజేస్తున్న త్రీటౌన్ సీఐ సీహెచ్ విద్యాసాగర్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న పరమేశ్వర్ తదితరులు

టీఎన్‌జీఓల సంఘం నేత పరమేశ్వర్

గజ్వేల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్‌జీఓల సంఘం నిరంతరం పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. సోమవారం టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల విజయవంతానికి ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. సంఘం గజ్వేల్‌శాఖ అధ్యక్షుడు లింగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, జిల్లా సహాయ అధ్యక్షుడు నిమ్మ సురేందర్, కోశాధికారి అశ్వక్ అహ్మద్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి జేబీనా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం

- జేవీవీ జిల్లా కార్యదర్శి సత్యం
- ఉత్సాహంగా చెకుముకి సంబరాలు

గజ్వేల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో చెకుముకి ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా కార్యదర్శి తుమ్మ సత్యం అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సంబరాల్లో హెచ్‌ఎం కృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో తార్కిక ఆలోచనావిధానాన్ని పెంపొందించడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణమూర్తి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాక బాలుర హైస్కూల్లో సోమవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులను నిర్వహించారు. విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా ఖమ్మంపల్లి హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, తిమ్మారెడ్డిపల్లి హైస్కూల్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విఠల్ నాయక్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొండపాక(గజ్వేల్): బహుమతులు అందుకొంటున్న విద్యార్థులు

క్రీడాస్ఫూర్తితో ముందుకు..

ఎమ్మెల్యే హరీశ్‌రావు



బహుమతులు అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: యువత క్రీడాస్ఫూర్తి కొనసాగించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నంగనూర్ మండలం పాలమాకుల యూత్ ఆధ్వర్యంలో టీఎచ్‌ఆర్–సీజన్2 వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. అలాగే పట్టణంలో ఎలక్ట్రానిక్ బైక్ చార్జింగ్ స్టేషన్, ఆన్‌లైన్ ఎగ్జామ్స్ సెంటర్‌లను ప్రారంభించారు.

మత కార్యక్రమాలకు తీసుకెళ్లడం తగదు

విద్యార్థి సంఘాల నేతలు

సిద్దిపేటరూరల్: విద్యార్థులను మతపరమైన కార్యక్రమాలకు తీసుకెళ్లడం తగదని, మర్పడగ జెడ్పీహెచ్ పాఠశాల ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, పీవైఎల్, డీబీఎఫ్ సంఘాల నాయకులు అనిల్, శేఖర్, వెంకట్ మాట్లాడారు. మర్పడగ హెచ్‌ఎం భైరయ్య, వెల్కటూర్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రాజయ్య గత 22న విద్యార్థులను మతపరమైన కార్యక్రమాలకు తీసుకెళ్లారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వారితో భజనలు, కోలాటాలు చేయించారని వాపోయారు. విషయంపై ఉన్నతాధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలి

కార్మిక సంఘాల పిలుపు

సిద్దిపేటఅర్బన్: ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని, ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా సోమవారం సిద్దిపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు గోపాలస్వామి, కిష్టపురం లక్ష్మణ్, ఈదరి మల్లేశం, బాలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని, ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించి, 16న నియోజకవర్గ కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి బంద్‌లో పాల్గొనాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ఆందోళనలో కార్మిక, రైతులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడు కనకయ్య, హెచ్‌ఎంఎస్ జిల్లా నాయకుడు రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

వెనుకబడిన విద్యారంగం

- సమస్యలు పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

సిద్దిపేటరూరల్: గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం వెనుకబడిపోయిందని, ఈ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏఓ రెహమన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎస్సీ, బీసీ హాస్టల్స్‌కు కేటాయిస్తున్న కాస్మెటిక్ చార్జీలు విద్యార్థులకు సరిపోవడం లేదని వాటిని పెంచాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.7,200 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ, లా, ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెప్యాల సంతోష్, తడూరి భరత్, పెండ్యాల రఘు, దుంపటి సంతోష్, హరీశ్, పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మొగిపురుగు సస్యరక్షణ అవసరం

వ్యవసాయ డివిజన్ అధికారి రాధిక

చేర్యాల(సిద్దిపేట): వరిలో మొగి పురుగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చేర్యాల వ్యవసాయ డివిజన్ అధికారి రాధిక సూచించారు. మండలంలోని నాగపురి డివిజన్ వ్యవసాయ అధికారి రాధిక, కొమురవెల్లి వ్యవసాయ అధికారి నరేశ్ సోమవారం పోసాన్‌పల్లి, అయినాపూర్ గ్రామాలలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో మొగిపురుగు, కాండం తొలుచు పురుగు పంటకు నష్టం చేస్తున్నాయన్నారు. వంట సంరక్షణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరంత ఫినోల్ 0.4జీ గుళికలు 4కిలోలు అదేవిధంగా కాటాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ 400 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. వీలైనంత వరకు యూరియా వాడకం తగ్గించుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో జక్కుల తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ రాధిక

సిబ్బంది సహకారం మరువలేనిది

బదిలీపై వెళుతున్న సీఐ రవికుమార్

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో పోలీసు ఉన్నతాధికారులు, తోటి ఉద్యోగులు, సిబ్బంది సహకారం మరువలేనిదని టూటౌన్ సీఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న రవికుమార్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఆర్మూర్ సీఐగా బదిలీ కావడంతో టూటౌన్ పీఎస్ సిబ్బంది సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రజలందరి సహాయ సహకారాలతో విధులు నిర్వహించానన్నారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సంతోష్, రవిరాజు, అనూష, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

అందని పంట నష్టపరిహారం

కిసాన్‌సంఘ్ నేత జస్వంత్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: గత యాసంగి కాలంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం డబ్బులు అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జస్వంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. అనంతరం మాట్లాడుతూ గత యాసంగి పంట కాలంలో అకాల వర్షాలతో వరి ధాన్యం రాలిపోయి జిల్లా వ్యాప్తంగా రైతులు నష్టపోయారన్నారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. దీంతో అధికారులు సర్వే చేసి పూర్తి నివేదికను అందించారు. కాని నేటికీ ఏ ఒక్కరైతుకు పంట నష్టం డబ్బులు అకౌంట్లలో జమకాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం డబ్బులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలడుగు శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, తొగుట మండల కార్యదర్శి పాండు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న కిసాన్‌సంఘ్ నాయకులు

పోచమ్మా.. చల్లంగా చూడమ్మా..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పిల్లాపాపలను చల్లంగా చూడమ్మా.. అంటూ భక్తులు కొండపోచమ్మకు మొక్కులు తీర్చుకొన్నారు. జాతర ప్రారంభమై రెండో లష్కర్ వారం కావడంతో సోమవారం భక్తులు కొండపోచమ్మను దర్శించుకొని పూజలు నిర్వహించారు. కొత్త కుండలను తీసుకువచ్చి బోనాలను తయారుచేసి డప్పు చప్పుళ్లు, శివసత్తుల శిగాల మధ్య ఆలయానికి చేరుకొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో తరలివస్తున్న భక్తులు

క్రమశిక్షణతోనే విద్యార్థుల రాణింపు

ఎంఈఓ జోగు ప్రభుదాసు

దుబ్బాక: క్రమశిక్షణతోనే విద్యార్థులు అన్నిరంగాల్లోను రాణిస్తారని ఎంఈఓ జోగు ప్రభుదాసు అన్నారు. ఇంగ్లిష్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్న పాఠశాలలో మండల స్థాయి సెల్ఫ్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, ఈఎల్‌టీఏ నిర్వాహకులు సయ్యద్ ముజీబ్ అలీ, ఉమామహేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ స్పెల్లింగ్ పోటీలు

మర్కూక్(గజ్వేల్): ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి ఇంగ్లిష్ స్పెల్లింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మర్కూక్ పాఠశాల విద్యార్థిని శ్రీజ ప్రథమస్థానం గెలుచుకోగా, ద్వితీయస్థానంలో పాములపర్తి పాఠశాల విద్యార్థి నాగచైతన్యరెడ్డి గెలుసుకొన్నట్లు ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సుజాత, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఐదు గిరికల బావి స్థలాన్ని కాపాడండి**

హుస్నాబాద్: స్థానిక ఆఫీస్ రోడ్‌లో ఆక్రమణకు గురవుతున్న ఐదు గిరికలబావి స్థలాన్ని కాపాడాలని కోరుతూ కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, కమిషనర్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. బావి వీధిలోకి వెళ్లేందుకు దారి చిన్నదిగా ఉందన్నారు. ఈ వీధిలోనే కమటం రవీందర్ అనే వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఇల్లు కడుతున్నాడని వాపోయారు. అలాగే ఐదు గిరికల బావి స్థలాన్ని ఆక్రమించి జక్కని లక్ష్మి ప్రహరీ నిర్మించారన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని కాలనీ వాసులు కోరారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ **విశ్వజన కళామండలి జిల్లా నూతన కమిటీ**

గజ్వేల్‌రూరల్: విశ్వజన కళామండలి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జిమాస్టార్జీ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్‌గా తుడుం ప్రకాశ్, కోకన్వీనర్‌గా బచ్చలి ప్రసాద్, కల్చరల్ కన్వీనర్‌గా తుడుం స్వామి, సలహా మండలి కన్వీనర్‌గా తుమ్మ శ్రీనివాస్‌ను నియమించారు. కార్యక్రమంలో శాంతాకుమారి, నర్సింహరాజు, మాచపురం బాల్‌నర్సయ్య, గజ్వేల్ అంబేద్కర్ సంఘం నాయకులు మన్నె కృష్ణ, ఎమ్మార్పీఎస్ పొలిట్ బ్యూరో సభ్యులు మైస రాములు, నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కార్మికుల సంక్షేమానికి కృషి : ఎంపీపీ లత**

తొగుట(దుబ్బాక): కల్లుగీత కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో సోమవారం కల్లుగీత వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపుల మూలంగా కల్లుగీత వృత్తి నిర్వీర్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదగిరి, సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణాగౌడ్, తొగుట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సాయి కుమార్, ఎంపీడీవో శ్రీధర్, ఏఓ మోహన్, ఐకేపీ ఏపీఎం మగ్దూం అలీ, ఏపీవో కిషన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, నాయకులు రమేశ్ పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు పౌష్టికాహారం**

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీపీ గజ్జెల సాయిలు కోరారు. సోమవారం మండల పరిధిలోని అల్వాల–చెప్యాల క్రాస్ రోడ్డులోని గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం, కిచెన్ రూంలోని సరులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకుడు సూకూరి లింగం తదితరులు ఉన్నారు.

◆ **ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి**

చేర్యాల(సిద్దిపేట): ఇళ్లులేని పేద కుటుంబాలకు 120 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 2వేల కుటుంబాలు కిరాయి ఇళ్లలో జీవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు చంద్రం, వెంకటేశం, బ్రహ్మయ్య, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **అక్రమ వెంచర్లపై చర్యలేవి..**

హుస్నాబాద్: పట్టణంలో అక్రమ వెంచర్లు, అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాల యజమానులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అక్రమ వెంచర్లు వెలిసినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రిజిస్ట్రేషన్లు చేయకుండా ఆపాలని కోరారు.

◆ **పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ**

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని సీనియర్ నాయకుడు మార్క సతీశ్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో ఇటీవల మృతి చెందిన రాజయ్య కుటుంబాన్ని సోమవారం పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. 50కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు.